## క్లుప్తంగా

### నేడు అచ్చంపేటలో జగనన్న సురక్ష

సామర్లకోట: జగనన్న సురక్ష శిబిరం సోమవారం అచ్చంపేట గ్రామంలో ప్రారంభమవుతుందని ఎంపీడీఓ డి.శ్రీలలిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మండల స్థాయి అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పంచాయతీ కార్యాలయం వద్ద ఉండి సమస్యలు తెలుసుకుంటారన్నారు. అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలోని చిన్నవీధిలో జగనన్న సురక్ష నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు.

### ఫ్లైఓవర్‌పై కారు నిలిచి ట్రాఫిక్ జామ్


కారును తొలగిస్తున్న క్రేన్

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ వంతెనపై కారు నిలిచి పోవడంతో ఆదివారం సాయంత్రం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో జాతర ఉత్సవం జరుగుతోంది. దాంతో పెద్దాపురం మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను ఫ్లైఓవర్ వంతెన మీదుగా మళ్లించారు. ఇటువంటి తరుణంలో కారు సాంకేతిక లోపంతో నిలిచి పోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై అడపా గరగా రావు తన సిబ్బందితో క్రేన్ సాయంతో కారును పక్కకు జరిపించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

### పూడుకుపోయిన పంట కాలువలు


యండపల్లిలో పూడుకుపోయిన కాలువ

కొత్తపల్లి: మండలంలోని ప్రధాన పంట కాలువలు ఎక్కడికక్కడ పూడుకుపోవడంతో నీరు సాగడం లేదు. దీనివల్ల తమ పొలాలకు నీరందడం లేదని గగ్గోలు పెడుతున్నా అధికారులు తూతూమంత్రపు చర్యలతో సరిపెట్టేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో తమకు ఇబ్బందులు మరింత పెరిగిపోతాయంటున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి పంట కాలువల్లో పూడికలు తొలగించి రైతుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

### పాత తహసీల్దార్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పిఠాపురం: పిఠాపురం పాత తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. కొత్త కార్యాలయం నిర్మించిన అనంతరం దీన్ని మూసేశారు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో కార్యాలయం లోపల నుంచి మంటలు వ్యాపించడంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

# శాకంబరిగా బాలాత్రిపురాంబిక

- పంచారామ క్షేత్రంలో దర్శనమిచ్చిన అమ్మవారు
- కలసి వచ్చిన మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం
- వేలాదిగా తరలి వచ్చిన భక్తజనం


పంచారామ క్షేత్రంలోని అమ్మవారికి దేవస్థానం తరపున సారె అందజేసిన అధికారులు, ట్రస్టు బోర్డు సభ్యులు


పంచారామ క్షేత్రంలో బాలా త్రిపురసుందరి


శాకంబరిగా దర్శనమిచ్చిన నూకాలమ్మ అమ్మవారు

సామర్లకోట: సుప్రసిద్ధ పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర ఆలయంలో ఆదివారం అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం, అందులోనూ మాసశివరాత్రి, స్వామివారి జన్మ నక్షత్రం ఆరుద్ర కలసిరావడంతో అమ్మవారికి, అయ్యవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయంతో పాటు పంచారామ క్షేత్రం అంతా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద అరటి చెట్ల గెలతో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. నంది మండపం వద్ద ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వేదికపై ఉంచి పూజలు చేశారు. ఆలయ ప్రాకారం చుట్టూ కూరగాయలు, ఆకుకూరలతో చేసిన అలంకరణ ఆకట్టుకుంది. ఈఓ నాగేమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు, ట్రస్టుబోర్డు సభ్యుల పర్యవేక్షణలో ఆలయ దీపారాధన సంఘ సభ్యులు, ఆలయ అర్చకుల సమక్షంలో దేవదాయశాఖ అధికారులు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ అభిషేక పండితుడు వేమూరి సోమేశ్వరశర్మ, ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా కుమారి, బొందలపు కృష్ణవేణి, ముమ్మిడి బేబి రాణి, ఆలయ సిబ్బంది, భక్త సంఘం సభ్యులు భక్తులకు సేవలందించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

**శాకంబరిగా నూకాలమ్మ అమ్మవారు**

పెద్దాపురం : కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు ఆదివారం వివిధ రకాల కూరగాయలు, పండ్ల అలంకరణలో శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యాన అన్ని చర్యలు చేపట్టారు. పెద్దాపురం సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో వెలుగుల సురేష్ బందోబస్తు నిర్వహించారు.

### ఆధ్యాత్మికత పెంపొందించే చర్యలు

- దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, హౌసింగ్ చైర్మన్ దొరబాబు


సారెతో పూజలు నిర్వహిస్తున్న సత్యనారాయణ, దొరబాబు, రాజప్ప


మరిడమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దాపురం: ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక మరిడమ్మ తల్లి జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక కుమ్మర వీధి ముత్యాలమ్మ తల్లి గుడి వద్ద నుంచి అమ్మవారి ఆలయానికి ఎమ్మెల్యే చిన రాజప్ప, దేవాదాయ శాఖ ఆర్జేసీ సురేషబాబు, డీసీ విజయరాజు, డీఈఓ పులి నారాయణమూర్తిలతో కలసి అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీల ఆధ్వర్యంలో వారికి ఆలయ మర్యాదలతో వేదపండితులు ఘన స్వాగతం పలికారు. గరగ నృత్యాలు, కోలాటం, మంగళ వాయిద్యాల నడుమ మూలవిరాట్‌ను దర్శించుకుని ఆషాఢ సారె సమర్పించారు. ముత్తైదువలు పసుపు, కుంకుమ, పూలను అమ్మవారి ప్రసాదంగా స్వీకరించి అలంకరించుకున్నారు. ఆయా దేవస్థానాల ఈఓలు కాట్నం జగన్మోహన శ్రీనివాస్, టీవీ సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, టీడీపీ కార్యదర్శి తూతిక రాజు పాల్గొన్నారు.

### శాకంబరుడిగా రామలింగేశ్వరుడు



పిఠాపురం: పంచాయతన సమేత ఉమా రామలింగేశ్వర స్వామి ఆదివారం శాకంబరుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు దత్తు వీరబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీకి మరో ఇద్దరు విద్యార్థులు


ఎ.వెంకటలక్ష్మి


కె.రూపశ్రీ నిర్మల

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేలా 10వ తరగతిలో మంచి మార్కులు వచ్చిన విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో చదివే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీనిలో భాగంగా ఇప్పటికే మండల పరిధిలో ఏడుగురు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కాగా మరో ఇద్దరు ఎంపికైనట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య ఆదివారం విలేకర్లకు తెలిపారు. దీనిలో భాగంగా పీబీ దేవం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎ.వెంకటలక్ష్మి, కె.రూపశ్రీ నిర్మలకు నూజివీడు ట్రిబుల్ ఐటీలో సీట్లు వచ్చాయని తెలిపారు.

# మయూరమై మదిని దోచె..

- నృత్యంలో రాణిస్తున్న యువత
- నాట్యజ్యోతి పురస్కారాల స్వీకరణ


నాట్యజ్యోతి పురస్కారాన్ని అందుకుంటున్న విద్యార్థినులు

కాకినాడ కల్చరల్: కేవలం చదువుకే విద్యార్థినులు పరిమితం కాకుండా నృత్యం, సంగీతం వంటి శాస్త్రీయ కళల్లో మేటిగా రాణిస్తున్నారు. వారిలో కళా తృష్ణ చదువుకు అటకం కాదని నిరూపిస్తున్నారు. అంతే కాకుండా కళల్లో శిక్షణ పొందడం ద్వారా ఏకాగ్రత, మానసిక ప్రశాంతత చేకూరుతోందని చెబుతున్నారు. దీనికి తోడు తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహించడంతో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తమ సత్తా చూపుతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికపై మయూరి నృత్యాలయం సంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 'గురు వందనం' పేరుతో నృత్య ప్రదర్శనలు చేశారు. ప్రదర్శనలో విద్యార్థినులు పాల్గొని చక్కని ప్రతిభ ప్రదర్శించి నాట్యజ్యోతి పురస్కారాలు స్వీకరించారు.

#### నాట్యం అంటే ప్రాణం



నా పేరు కె.జియ సుప్రజ. నాట్యజ్యోతి అవార్డు పొందడం చాలా సంతోషంగా ఉంది. 4 తరగతి చదువుతున్నాను. అంతర్జాతీయ వేదికలపై నృత్య ప్రదర్శన చేసి మెప్పించాలనే ఆశయంతో శిక్షణ పొందుతున్నాను. మా తల్లిదండ్రులు ప్రేమ్‌కుమార్, సుధారాణి, ముఖ్యంగా మా గ్రాండ్ మదర్ సుగుణ మంచి సహకారం అందజేస్తున్నారు.

#### మంచి నర్తకిగా రాణిస్తా



నాపేరు దేవిశ్రీ లక్ష్మి ప్రసన్న. నాట్యజ్యోతి అవార్డు పొందడం ఆనందంగా ఉంది. 7వ తరగతి చదువుతున్నా. శాస్త్రీయ నృత్యం అంటే ప్రాణం. మరిన్ని మెళకువలు నేర్చుకుని అంతర్జాతీయ వేదికపై ప్రదర్శన ఇవ్వాలనేది నా కోరిక. చదువుకు కళల అభ్యసన ఆటంకం కాదు. మరింత ఏకాగ్రతను పెరుగుతోంది.

#### నాట్యానికి ఆదరణ పెరుగుతోంది



ప్రస్తుతం నృత్యానికి ఆదరణ పెరుగుతోంది. ఈ కళపై ఆసక్తి ఉన్న వారిని నర్తకీమణులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. ఈ కళలను కాపాడేందుకు చిరుప్రయత్నం చేస్తున్నాం. అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలు ఇచ్చే స్థాయిలో విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నాం.

– నాట్యాచార్య బేతా సత్యనారాయణ, కాకినాడ

### ఆపద్బాంధవి మా వలంటీర్

వాలంటీర్లకు వందనం

కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం చదలాడ గ్రామ వలంటీర్‌గా గట్టిం అరుణ సేవలందిస్తోంది. ఆమెకు అప్పగించిన 50 కుటుంబాల వారికి సేవలందించడమే గాక తమ పరిధిలో ఏ కుటంబానికి ప్రభుత్వ సంక్షేమం అందకపోయినా ఆమె చొరవ తీసుకుని అది పూర్తి అయ్యి లబ్ధిదారులకు మేలు చేకూరే వరకు ఆమె పడుతున్న కష్టాన్ని అందరూ అభినందిస్తున్నారు.


వైఎస్సార్ బీమా లబ్ధిదారులకు వేలిముద్రలు సేకరిస్తున్న వలంటీర్ అరుణ

#### ఆమే లేకుంటే బీమా వచ్చేది కాదు



వలంటీర్ అరుణ లేకుంటే నాకు బీమా వచ్చి ఉండేది కాదు. వేలిముద్రలు పడని కారణంగా టెక్నికల్ ఇబ్బందులున్నాయని నాకు వైఎస్సార్ బీమా పూర్తి కాదెమో అనుకున్నాం. ఓ కుటుంబ సభ్యురాలిగా అందరితో కలసిపోయి సేవందిస్తోంది. వలంటీర్ల సేవలు మరులేం. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుతుండగానే వచ్చి పింఛన్ సొమ్ములు అందివ్వడమే గాకుండా ప్రతి సంక్షేమానికి అవసరమైన సేవలందిచడంలో ఆమె అందిస్తున్న సహకారం మరువలేనిది.

– తాడాల పాపాయి, వైఎస్సార్ బీమా లబ్ధిదారు, చదలాడ, పెద్దాపురం మండలం

#### మా వలంటీర్ సంక్షేమాన్ని చేరువ చేసింది



కొత్తపల్లి: ప్రభుత్వం అందించే సంక్షేమాన్ని మాకు తెలియజేయడంతో పాటు వాటిని మాకు మా వలంటీరు సిద్ధి మీనాక్షి చేరువ చేసింది. మాకు అమ్మ ఒడి, నేతన్న నేస్తం తదితర సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి అవి మాకు వచ్చేలా చేసింది. నాకు ప్రతి నెల 1వ తేదీన తెల్లవారుతుండగానే ఇంటికి వచ్చి పింఛన్ అందజేస్తుంది. ప్రభుత్వ పథకాలు పేదలకు చేరవేయడంలో వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి.

– రాజపంతుల మోహన్, కుతుకుడుమిల్లి

# చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సామర్లకోట: మండల పరిధిలో బోయనపూడి గ్రామానికి చెందిన కరణం రమణ కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు సామర్లకోట పోలీసులు ఆదివారం రాత్రి తెలిపారు. కుటుంబ సభ్యులతో పొలం వివాదం కారణంగా రమణ పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు అతడిని కాకినాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయినట్లు రమణ కుమారుడు సతీష్ పోలీసులకు తెలిపారు. సతీష్ ఫిర్యాదు మేరకు సీఐ కె.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో ఒకరి మృతి**

పిఠాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పిఠాపురం పట్టణ పోలీసులు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన పెంకే గుర్రయ్య(50) కాకినాడలోని సర్పవరంలో వేరుసెనగ కాయల వ్యాపారం చేస్తుంటాడు. రోజూలానే శనివారం రాత్రి వ్యాపారం ముగించుకుని కారులో చేబ్రోలు వెళుతుండగా పిఠాపురం వైజంక్షన్ వద్ద లారీని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో అతడిని 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పిఠాపురం పట్టణ ఎస్‌ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కిటకిటలాడిన సాగర తీరం


ఉప్పాడ సాగర తీరంలో సందర్శకులు


కడలి కెరటాల్లో కేరింతలు కొడుతున్న పర్యాటకులు

కొత్తపల్లి: ఉప్పాడ తీర ప్రాంతం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర తీరానికి చేరుకుని కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడం వల్ల కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ రామలింగేశ్వరరావు సహా పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పర్యాటకుల ఆటపాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. తుని సమీపంలోని లోవ తలుపులమ్మతల్లి దర్శనానికి వచ్చిన భక్తులు సైతం మధ్యాహ్నానికి ఉప్పాడ సాగర తీరానికి చేరుకుని సందడి చేశారు.

# వెదజల్లు సాగు.. లాభాలు బాగు..

- పెట్టుబడి వ్యయం తగ్గుతుందంటున్న అధికారులు
- ఆసక్తి చూపిస్తున్న అన్నదాతలు


పొలంలో విత్తనాలను వెదజల్లుతున్న రైతు

పెద్దాపురం: ప్రస్తుత ఖరీఫ్‌లో ఎక్కువ మంది రైతులు వెదజల్లు విధానంలో వరి సాగు చేస్తున్నారు. ఏళ్ల తరబడి అలవాటుగా వస్తున్న వరినాట్ల విధానానికి బదులు వెదజల్లు సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఏడాది కాలువ నీరు ఆలస్యం కావడం, రుతుపవనాల జాప్యంతో రైతులు నారుమడి తయారీ ఆలస్యమైంది. గత వారం రోజులుగా వాతావరణం చల్లబడి వర్షాలు కురవడంతో అన్నదాతలు నారుమడుల తయారీ పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే ఇప్పుడు నారుమడులు వేసుకోవడం కంటే నేరుగా వెదజల్లే పద్ధతిలో సాగుచేస్తే పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు పంట త్వరగా చేతికొస్తుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

**వెదజల్లుపై పెరిగిన అవగాహన**

నియోజకవర్గ పరిధిలో పెద్దాపురం, సామర్లకోట మండలాల్లో 34,446 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. అలాగే పెద్దాపురం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో రంగంపేట మండలంలో 8,808 ఎకరాలు, కిర్లంపూడి మండలంలో 12,090 వెరసి సబ్ డివిజన్ పరిధిలో 23,724 ఎకరాల్లో వరి సాగు జరుగుతుంది. వెదజల్లు పద్ధతిలోని సానుకూల అంశాలు, లాభాలను వ్యవసాయధికారులు రైతులకు తెలియజేస్తున్నారు. అవగాహన పెంచుకున్న అత్యధిక శాతం మంది రైతులు ఈ సారి ఈ పద్ధతి వైపు మొగ్గు చూపారు. గతేడాది కంటే ఈ ఏడాది 63 శాతం మంది రైతులు వెదజల్లు పద్ధతిలోనే సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

**నారు వేయాల్సి వస్తే..**

నాట్లు వేయడానికి 15 రోజులు ముందే పొలాన్ని దమ్ము చేయడం ప్రారంభించి, 2–3 దఫాలుగా మురగ దమ్ము చేయాలి. పొలమంతా సమానంగా దమ్ము చెక్కతో చదును చేయాలి. నారు వేయడానికి సారవంతమైన మెరక ప్రదేశాన్ని ఎంచుకోవాలి. ఎకరం విస్తీర్ణానికి మూడు సెంట్ల నారుమడి తయారు చేసుకోవాలి. నారుమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ము చేసి చదును చేసి నీరు పెట్టుకోవడానికి, తీయడానికి వీలుగా గాడి తయారు చేసుకోవాలి. సేంద్రియ ఎరువు వేసి కలియ దున్నుకోవాలి. విత్తే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి. శిలీంద్ర నాశినితో శుద్ధి చేసి మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు ఐదు కేజీల చొప్పున చల్లుకోవాలి. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి రెండు గ్రాములు జింకు సల్ఫేటు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

#### విత్తనాలు వెదజల్లాం



ఏటా ఖరీఫ్‌లో వరి నారుమళ్లు వేసి నాట్లు వేసేవాళ్లం. వ్యవసాయాధికారుల సూచనలతో వెదజల్లు విధానంలో సాగు చేస్తున్నాం. కూలీల సమస్య అధిగమించడమే కాకుండా సాగు ఖర్చు కూడా చాలా తగ్గుతుంది.

– సుందరెడ్డి రాజు, పులిమేరు, కౌలు రైతు

#### పెట్టుబడి వ్యయం తగ్గుతుంది



వెదజల్లు పద్ధతి వల్ల పెట్టుబడి వ్యయం చాలా వరకూ తగ్గుతుంది. ఎకరాకు 15 నుంచి 17 కిలోల విత్తనాలతో పాటు సాగునీరు కూడా ఆదా అవుతుంది. ప్రతి గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– కె.సంజయ్‌కుమార్, వ్యవసాయ శాఖ ఏఓ, పెద్దాపురం

# పిఠాపురంలో క్రైస్తవుల ర్యాలీ


పిఠాపురంలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

పిఠాపురం: మణిపూర్‌లో చర్చిలపై దాడులను ఖండిస్తూ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ పిఠాపురం శాఖ ఆధ్వర్యంలో క్రైస్తవులు ఆదివారం పిఠాపురంలో ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవులకు రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని క్రైస్తవులకు న్యాయం చేయాలని, రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పిఠాపురం ఆంధ్రా బాప్టిస్ట్ సెంటినరీ సంఘం, పాస్టర్స్ ఫెలోషిప్ ఫీల్డు కౌన్సిల్ సభ్యులు, పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.